క్లుప్తంగా

నాగలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నాగలింగేశ్వరస్వామి

దెందులూరు: మండలంలోని గాలాయగూడెంలోని శ్రీ భీమ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. అలంకరణ అనంతరం భీమ నాగలింగేశ్వర స్వామి పరమేశ్వ రుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్చండి


చిన్నారులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: బడిఈడు పిల్లలను బడిలోనే చేర్పించాలని ఎస్ఎంసీ చైర్మన్ కర్నాటి వెంకటేష్ తెలిపారు. మండలంలో ఉప్పాకపాడు పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఇంటింటికీ తిరిగి మన ఊరి బడిలో పిల్లలను చేర్చండి అని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు గుణాత్మక విద్య అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు సుబ్బలక్ష్మి, ఝాన్సీ, బేబి, ఆయా సువర్ణ రత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు మంజూరు చేయండి

దెందులూరు: విజయవాడ నుంచి దెందులూరు మీదుగా ద్వారకా తిరుమలకు బస్సు సర్వీస్ మంజూరు చేయాలని ఏలూరు ఎంపీ పొట్ట మహేష్ యాదవ్ ఆర్టీసీ ఎండీకి సిఫార్సు చేశారని దెందులూరు రైల్వే ఓవర్ బ్రిడ్జి సాధన సమితి చైర్మన్ మద్దా భూషణం అన్నారు. దెందులూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చేరుకునేందుకు ఏలూరు నుంచి 20 గ్రామాలు ప్రజలతోపాటు ఏలూరు ఎగువ ప్రాంతాల నుంచి అనేకమంది భీమడోలు మీదుగా కాకుండా దగ్గర మార్గమైన దెందులూరు మీదుగా ప్రయాణం చేస్తుంటారన్నారు. దశాబ్దాల కాలం నుంచి ప్రయాణికులు పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలకు వెళ్లేందుకు బస్సు సర్వీస్ కోసం ఎన్నో పోరాటాలు అర్జీలు పెట్టడం జరిగిందన్నారు. సోమవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు బస్సు సర్వీస్ మంజూరు సిఫార్సు చేశారని ఆయన తెలిపారు.

పన్నుల వసూళ్లపై దృష్టి


చంద్రశేఖర్

ఉంగుటూరు: మండలంలో ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్ల వేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం పంచాయితీ కార్యదర్శులతో పన్ను వసూళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జరిపిన సమావేశంలో ఇవొపిఆర్‌డి మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు ఈనెలాఖరు వరకే సమయం ఉందన్నారు. నూరు శాతం పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు.

రేపు జాబ్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ కళాశాల (స్కిల్ హబ్)లో ఈ నెల 19న జాబ్ మేళ నిర్వహించనున్నట్టు డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్ ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీస్, సీఎంఆర్ టెక్స్‌టైల్స్ - జ్యువలరీ, బజాజ్ క్యాపిటల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 58 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 94934 82414, టోల్ ఫ్రీ 99888 53335లో సంప్రదించవచ్చని తెలిపారు.

పోలీస్ శాఖకు డ్రోన్ అందజేత

ఏలూరు (టూటౌన్): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్న జిల్లా పోలీస్ యంత్రాంగానికి కోకో కోల బాటిలింగ్ యూనిట్ యాజమాన్యం డ్రోన్‌ను సోమవారం ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ చాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రత పరిరక్షణకు పోలీసులు అహర్నిశలు సేవలందిస్తున్నారని చెప్పారు. డ్రోన్‌ను అందజేతకు కృషి చేసిన డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, భీమడోలు సీఐ, సహకరించిన అధికారులను అభినందించారు. ట్రాఫిక్ పర్యవేక్షణ, గస్తీ, అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్ సహాయపడుతుందని ఎస్పీ తెలిపారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, సీఐ యూజే విల్సన్, ఎస్సై సుధీర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమానికి చెల్లుచీటీ..!

- నూపర్ సిక్స్ అమలు కోసం ప్రజల ఎదురుచూపులు
- జగన్ ప్రభుత్వంలో ప్రతినెలా సంక్షేమ పండుగ
- చిరువ్యాపారాలతో ఆర్థికంగా నిలబడ్డ మహిళలు
- నేటి ప్రభుత్వంలో వారి పరిస్థితి ఆయోమయం


ఆసరా చెక్కు (ఫైల్)

దెందులూరు: గత ఐదేళ్లు జగన్ ప్రభుత్వం సంక్షేమ జాతరతో ఇంటింటా పండగ చేసుకున్న ప్రజానీకానికి కూటమి ప్రభుత్వంలో ఆ సంక్షేమం జాడ కరువైంది. ప్రభుత్వం ఏర్పడి 9నెలల కావస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ అమలు చేయకపోవడంతో ప్రజలకు చిరెత్తుకొస్తోంది. కుళాయిలవద్ద, టీకొట్టు, కిరాణా దుకాణాల దగ్గర కూటమి ప్రభుత్వ తీరును ప్రజలు ముఖ్యంగా మహిళలు దుమ్మెత్తిపోస్తున్నారు. జగన్ ఉంటే ఈ పాటికి నెలకో సంక్షేమం చొప్పున తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమచేసేవారని, కానీ నేటి ప్రభు త్వం ఏర్పడి అర్థ సంవత్సరానికి దగ్గర పడుతున్నా ఇంతవరకు ఇచ్చిన 6హామీలే అమలు చేయలేదు..బడ్జెట్లో సైతం పూర్తి స్థాయిలో నిధులు కేటాయింపులు జరపలేదని మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం పెంచిన పింఛను మాత్రమే ఇస్తున్నారని ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం పథకం కూడా అర కొరగానే జరుగుతుంద నే విమర్శలు వినిపిస్తున్నాయి. పెట్టే వారిని దూరం చేసుకున్నామని కొట్టే వారిని అందలమెక్కించారంటూ ప్రజానీకం బాహాటంగా విమర్శించే పరిస్థితి నెలకొంది.

జగన్ హయాంలో రూ.5290.17 కోట్ల సంక్షేమం

గత జనగ్ ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రత్యక్ష, పరోక్ష నగదు బదిలీ కింద నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులందరికీ 33పథకాలకు సంబంధించి రూ.5209.17 కోట్లు లబ్ధిదారులు ఖాతాలకు జమ చేసిన జగన్ ప్రభుత్వం పేదవార్గలకు అండగా నిలిచింది. తాగునీరు, పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి సుమారు రూ.2000 కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది.

పేద వర్గాలు అల్లాడుతున్నారు

సంక్షేమం లేక పేదవర్గాలు అల్లాడిపోతున్నారు. జగన్ ప్రభుత్వ హాయంలో పొందిన సంక్షేమ పథకాలు నేడు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు ఎటువంటి లబ్ధి చేకూరడం లేదని ప్రజలు ముఖ్యంగా మహిళలు వాపో తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా నేటి కూటమి పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలి.

మోసపోయామన్న ప్రజానీకం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంఉందా అని ప్రజలు తమను తాము ప్రశ్నించుకుంటున్నారు. కూటమి నేతల మాయమాటలు, అబద్దాలు నమ్మి మోసపోయా మని ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారు. జగన్ ఉన్నప్పుడు ప్రతినెలా పండేగనని కానీ నేటి ప్రభుత్వం గత సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు నిలుపుదలచేసి, ఇస్తామన్న సూపర్ సిక్స్‌ను తుంగలో తొక్కారని ప్రజలు తిడుతున్నా రు. ఎన్నికల ముందు వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు, అవగాహనతో అమలు చేయగలిగే హామీలనే ఇచ్చారని, తూచా తప్పకుండా అమలు చేశారని, కూటమి నేతలు మాత్రం అమలు చేయలేమని తెలిసి కూడా ప్రజలకు మోసం చేయడానికి కంకణం కట్టుకుని గద్దెనెక్కారని విమర్శిస్తున్నారు. కూటమి నేతల మాయమాటలు నమ్మి మోసపోయామంటూ ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు.

ట్రాఫిక్ సమస్యతో నిత్యం అవస్థలు

- అభివృద్ధికి నోచని కీలక రహదారులు


ఉంగుటూరు వంతెన సెంటర్లో నిలిచిపోయిన ట్రాఫిక్ దృశ్యం

ఉంగుటూరు: మండలంలోని రోడ్లకు మోక్షం లభిస్తుందని ఆశించిన ప్రజలకి నిరాశే ఎదురైంది. ఉంగుటూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే పలు కీలక మార్గాలు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఇరుకు మార్గాలతో ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. సాధారణంగా ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. దీనికి తోటు ఇరుకు రోడ్లతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అయితే ఉంగుటూరులో సోమవారం సంత కావడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పురాతనమైన బ్రిటిష్ కాలం నాటి వంతెన ఛిద్రమైంది. పంచాయతీ నిర్మించిన బెయిల్ బ్రిడ్జిపై ట్రాఫిక్ సమస్య ఉంది. అసలే బ్రిడ్జి ఇరుకు దానికి తగ్గట్టుగా జాతీయ రహదారిపై టోల్ ప్లాజా ఏర్పాటుతో టోల్ ఎగవేత దార్లు అందరూ నాచుగుంట బ్రిడ్జి మీదుగా ఉంగుటూరు వచ్చి ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులు, అధికార్లకు విన్నవించుకున్నా ఫలితం లేదు. ప్రజలు, విద్యార్థులు జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్లు, లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు ఒకే సారి రావడంతో వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య జఠిలమవుతుంది. గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. మరిన్ని ప్రమాదాలు జరగకముందే వంతెన సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పేద వర్గాలవారు అల్లాడుతున్నారు



సంక్షేమం లేక పేదవర్గాలవారు అల్లాడిపోతున్నారు. జగన్ ప్రభుత్వ హాయంలో పొందిన సంక్షేమ పథకాలు నేడు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు ఎటువంటి లబ్ధి చేకురండం లేదని ప్రజలు ముఖ్యంగా మహిళలు వాపోతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా నేటి కూటమి పాలకులకు ఏమాత్రం చిత్త శుద్ధి ఉన్నా ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలి.

– సొంగా ప్రమీల, డ్వాక్రా సభ్యురాలు, ఎంపీటీసీ గాలాయగూడెం

అరచేతిలో వైకుంఠం చూపారు..



కూటమి నేతలు అరచేతిలో వైకుంఠం చూపి, అమలు కానీ హామీలు ఇచ్చి అధికారం చేపట్టారు. ఒక్క పింఛన్ పెంచారు తప్ప జగన్ ప్రభుత్వం కంటే మించి ఇది చేశామని చెప్పుకునే పథకం ఏదీ లేదు. జగన్ ప్రభుత్వంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా ఏవిధమైన లోటుకు తావులేకుండా ప్రతినెలా ఏదో ఒక పథకం అమలు చేశారు. ఏడాదిలో కనీసం ఒక్కో కుటుంబానికి 3,4 పథకాలతో లబ్ధి లభించింది. ఆనందంగా జీవినం సాగించాం.

– ఎం.దుర్గా కుమారి, గ్రామ సర్పంచ్, మేధినరావుపాలెం

వివక్షత లేని పాలన కావాలి



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కులం, మతం ప్రాంతం, వర్గం పార్టీ ఇలా బేధాలు లేకుండా అందరికీ అభివృద్ధి సంక్షేమంతో సమన్యాయ పాలన చేశారు. కూటమి ప్రభుత్వం కూడా అభివృద్ధి సంక్షేమం వివక్షత లేకుండా అమలు చేయాలి, అందరికీ న్యాయం జరగాలి.

– గొరిపర్తి వరలక్ష్మి, ఎంపీటీసీ కొవ్వలి

వర్గీకరణ పేరుతో దళితులను విభజించడం దారుణం


పిప్పరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దళిత నేతలు

గణపవరం: ఎస్సీ వర్గీకరణ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా దళితులను విభజించడం దారుణమని, ఈప్రక్రియను తక్షణం నిలిపివేయాలని మాలమహానాడు జాతీయాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. సోమవారం గణపవరం మండలం పిప్పరలో మాలమహానాడు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ఫలాలను దళితుల మధ్య విభజించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. పార్లమెంట్‌లో చట్టం చేయకుండా, సుప్రీం కోర్టు తీర్పును ఖాతరు చేయకుండా వర్గీకరణపేరుతో దళితులను విభజిస్తే కూటమి ప్రభుత్వానికి తిప్పలు తప్పవని హెచ్చరించారు. వర్గీకరణ పేరుతో రెండు తెలుగు రాష్ట్రాలు హడావుడిగా కమిషన్‌లు ఏర్పాటు చేసి ఎస్సీల జనాభాను తగ్గించే కుతంత్రాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సుమారు 70 లక్షలు ఉన్న మాలలను కేవలం 40లక్షలుగా ప్రచారం చేస్తూ రిజర్వేషన్‌లు తగ్గించడానికి కుట్రలు జరుగుతున్నాయని దీనిపై మాలలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకులు సబ్బితిరాజు, వెన్నపు సుధాకర్, బీరబ్రదర్స్, నీతిపూడి బ్రదర్స్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతల సేవలు మరువలేనివి


సనపల రామకృష్ణారావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: పాఠశాల అభివృద్ధికి దాతలు చేస్తున్న సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు విరాళాలు అందజేసిన పూర్వ విద్యార్థి సనపల రామకృష్ణారావు, భానుమతి దంపతులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థి అయిన రామకృష్ణారావు పాఠశాల అభివృద్ధికి నిధులు సమకూర్చడం మరువలేనిది కొనియాడారు. ఇదే పాఠశాలలో క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి, సభ్యులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో లోపాలను సవరించాలి


ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీవో

ఉంగుటూరు: లోపాలను సవరించి ఓటరు జాబితాను క్రమబద్ధీకరణలో తయారు చేయాలని ఆర్డీవో అంబరీష్ తెలిపారు. సోమవారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు తీసుకువచ్చిన అంశాలతో ఏకీభవిస్తూ ఎన్నికల డీటీకి కొన్ని ఆదేశాలు ఇచ్చారు. ఓటరుకల వేర్వేరు బూత్‌లకు వెళ్లి ఓటు వేయడం ఇబ్బంది కరంగా మారిందని పలువురు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బిఎల్‌వోలు, బిఎల్ఏలతో సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కొరిపల్లి వెంకట అప్పారు, ఉంగుటూరు తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, నిడమర్రు తహసీల్దార్ నాగరాజు, టీడీపోతురాజు తదితరులు పాల్గొన్నారు. 2019 కి ముందు ప్రభుత్వ భూముల్లో (పోరంబోకు) ఇళ్లు కట్టుకుని ఉన్న వారికి ఆఇంటి స్థలాలు రెగ్యులైజేషన్ చేయడం జరుగుతుందని ఆర్డీవో అంబరీష్ తెలిపారు. గ్రామాల్లో రీసర్వే జరుగుతుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పెదవేగి : అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం బి శింగవరం గ్రామానికి చెందిన పామర్తి రామతులసి ఈనెల 16 తేదీ రాత్రి సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్ ఉక్కుకు చీరతో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించే లోపే రామతులసి(29) మృతి చెందినట్లు, పుట్టింటి వారు వచ్చేసరికి శవ పేటికలో పడుకోపెట్టి ఉంచినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతురాలికి భర్త రాంబాబు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకమని మోటార్ వాహనాల తనిఖీ అధికారి పి.రమేష్ బాబు అన్నారు. సోమవారం నగరంలోని ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో రహదారి భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. 40 ఏళ్ల వయసు దాటిన ప్రతి డ్రైవర్ తప్పకుండా ఎప్పటికప్పుడు కంటి, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మనం స్వయంగా డ్రైవ్ చేసినప్పటికీ ఎదుటి వారివల్లా ప్రమాదాలు సంభవిస్తుంటాయని, దానికి తగ్గట్టుగా ప్రతి చాకచక్యంగా ప్రమాదాన్ని తప్పించగలిగే నైపుణ్యాన్ని పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు ఎస్ జగదీష్ బాబు, పి.నరేంద్ర బాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం


గణపవరం: పరీక్షా కేంద్రంలో పరీక్ష రాయడానికి సిద్ధంగా విద్యార్థులు


భీమడోలు: గుణ్ణంపల్లికి చెందిన నక్కా సాత్విక్‌ను వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న దృశ్యం

భీమడోలు: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా పరీక్షలు నిర్వహిస్తున్న ఆరు పరీక్షా కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 996 మంది హాజరు కావాల్సి ఉండగా 969 మంది హాజరయ్యారు. 27 మంది గైర్హజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి పరిశీలించారు. మండలంలోని పలు పాఠశాలలో ముగ్గురు దివ్యాంగు విద్యార్థులు ఇతరుల సహకారంతో పరీక్ష రాసారు. మండలంలోని భీమడోలు పరీక్షా కేంద్రంలోకి మంచినీటి బ్యాటిల్స్‌ను సైతం తీసుకుని వెళ్లనివ్వకపోవడంతో సంబంధిత అధికారులతో తల్లిదండ్రులు వాగ్వివాదానికి దిగారు. తమ పిల్లలకు ఆనారోగ్యంతో బాధపడుతున్నారని, వారు వేడి నీళ్ల తాగాల్సి ఉందని అనుమతి ఇవ్వకపోవడం ఏమిటని వారిని ప్రశ్నించారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో విద్యార్థులంతా ప్రార్థనలు చేశారు. భీమడోలు హైస్కూల్‌లో 274 మందికి గాను 270 మంది హాజరు కాగా 4గురు గైర్హజరయ్యారు. పోలసానిపల్లిలో 138 మందికి నూరు శాతం హాజరయ్యారు. పూళ్లలో 155 మందికి గాను 148 మంది హాజరు కాగా 7గురు హాజరు కాలేదు. గుండుగొలనులో 229 మందికి గాను 218 మంది హాజరు కాగా 11 మంది గైర్హజరయ్యారు. ఆగడాల లంకలో 115 మందికి గాను 113 హాజరయ్యారు. ఇద్దరు హాజరు కాలేదని ఎంఈవో- 1 ఈదుపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

పది పరీక్షలకు 95 శాతం హాజరు

నిడమర్రు: మండలంలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి 3 పరీక్షా కేంద్రాల్లో తెలుగు పరీక్షల నిర్వహణ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 387 మంది విద్యార్థులకు గానూ 367 మంది హాజరయ్యారు. వీరిలో 48 మంది ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ విద్యార్థుల్లో 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో-2 భాస్కర్‌కుమార్ తెలిపారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

గణపవరం: పదో తరగతి పరీక్షలు సోమవారం గణపవరం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 6 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 744 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్ష రాస్తున్నారు. గణపవరంలో రెండు, పిప్పరలో రెండు, కాశిపాడు, అర్ధవరంలో ఒక్కొక్కటి చొప్పున పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశామని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య తెలిపారు. ఆరుగురు సీఎస్‌లు, ఆరుగురు డివోలతో పాటు 48మంది సిబ్బందితో పరీక్షల విధులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బాలయ్య తెలిపారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం 799 మంది విద్యార్థులకు 11 మంది గైర్హాజరయ్యారు. కైకరం, చేబ్రోలు గరల్స్ హైస్కూలు, నారాయణపురం, ఉంగుటూరు, బొమ్మిడి పరీక్ష కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, వైద్య సదుపాయం వంటివి ఏర్పాటు చేశారు. ఎక్కడ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తలేదు. మాస్ కాపీయింగ్ వంటి ఘటనలు జరగలేదని విద్యాశాఖాధికారులు తెలిపారు. డీవైఈవో రవీంద్ర భారతి పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

పదివేగిలో...

పెదవేగి : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పెదవేగి మండలంలో మొత్తం 20 ఉన్నత పాఠశాలలు ఉండగా, ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఆరు కేంద్రాల్లో కలిపి 837 మంది. పరీక్షలు రాయాల్సి ఉండగా 819 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని పెదవేగి ఎంఈవో ఎస్ నరసింహామూర్తి తెలిపారు. ఆరు కేంద్రాల్లో కలిపి 18 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. మొత్తంగా తొలిరోజు పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా సాగింది. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ట బందోబస్తుతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, ప్రథమ చికిత్స సదుపాయం కల్పించాలని ఎంఈవో వివరించారు.

పెదపాడు మండలంలో...

పెదపాడు: మండలంలోని 6 పరీక్షా కేంద్రాల్లో 811 మందికిగాను 779 మంది హాజరయ్యారని పెదపాడు ఎంఈఓలు సబ్బితి నర్సింహామూర్తి, దేవినేని వెంకటరమణలు తెలిపారు. సోమవారం పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చెప్పారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 132 మందికి గాను121 మంది, వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 145 మందికిగాను 136 మంది జ్యోతి అప్పనవీడు ఏ సెంటర్‌లో171 మందికిగాను 166మంది బీ సెంటర్‌లో 190 మందికిగాను187 మంది, కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 151 మందికిగాను 150 మంది ఎఫ్ఆర్ గుడ్‌న్యూస్ స్కూల్‌లో 22మందికిగాను 19మంది హాజరయ్యారు. మొత్తం 6 సెంటర్లలో 11మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.


పెదపాడు: పదో తరగతి పరీక్షకు హాజరైన విద్యార్థులు


భీమడోలు: విద్యార్థులను చెక్ చేసి పంపుతున్న సిబ్బంది


ఉంగుటూరు: కైకరంలో విద్యార్థులను చెక్ చేసి పంపుతున్న ఉపాధ్యాయులు

సుస్థిరాభివృద్ధిలో సొసైటీల పాత్ర కీలకం

ఏలూరు(మెట్రో): దేశ సుస్థిర అభివృద్ధిలో సహకార సంస్థల పాత్ర కీలకమని, సహకార సంఘాల వ్యవస్థను మరింత బలోపేతాని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో సోమవారం జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరం ప్రకటించిందన్నారు. సొసైటీల ద్వారా గ్రామాల్లో ప్రజలకు స్థిరమైన జీవనోపాధి సృష్టి, వారి ఆర్థికాభివృద్ధికి కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ అంశంపై ప్రజలలో అవగాహన కలిగించేందుకు ర్యాలీలు, సమావేశాలు, మారథాన్‌లు నిర్వహించాలన్నారు. జిల్లాలో 2025 సంవత్సరంలో నెలలవారీగా చేయాల్సిన పనులపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. సహకార వ్యవస్థ ద్వారా జరిగే సమాజాభివృద్ధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు డిసెంబర్ వరకూ ప్రతి నెలా నిర్వహించే కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సహకార సంవత్సరం థీమ్ లోగోను కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, జిల్లా సహకార శాఖాధికారి ఎ.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సీఆర్ రెడ్డి విద్యా సంస్థల మాజీ అధినేత, విద్యాదాత అల్లూరి బాబినీడు జయంతి సందర్భంగా సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సోమవారం నగరంలోని విహాస్ చారిటబుల్ ట్రస్ట్‌కు నిత్యావసర సరకులను అందించారు. ప్రిన్సిపాల్ సాయి కుమారి శంకర్, కరస్పాండెంట్ వంకినేని రఘు కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

దెందులూరు, ఉంగుటూరు
90102 23729
80746 26268
Office mail : tpgadvt@gmail.com